

పోలీసులకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ చిదిరాల రాణి, హాజరైన పోలీసులు

# నిందితులకు శిక్ష పడేలా చూడాలి

- కేసుల దర్యాప్తులో జాగ్రత్తలు పాటించాలి
- అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ చిదిరాల రాణి

బోధన్, డిసెంబర్ 2: క్రిమినల్ కేసుల నమోదు, సాక్ష్యాల సేకరణతో పాటు ప్రతి అంశంపై పోలీసులు జాగ్రత్తలు పాటించాలని అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ చిదిరాల రాణి అన్నారు. శనివారం బోధన్ పట్టణంలోని న్యాయస్థానంలో రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ వైజయంతి, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ లక్ష్మీ నర్సయ్య ఆదేశాల మేరకు ప్రతినెలా మొదటి శనివారం పోలీసులకు నిర్వహిస్తున్న అవగాహన సదస్సులో భాగంగా బోధన్ న్యాయస్థానంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ప్రతి క్రిమినల్ కేసు, కేసులు వీగిపోకుండా, నిందితులకు శిక్ష పడేలా పోలీసులు జాగ్రత్తలు చేపట్టాలని ఆమె సూచించారు. అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జి.శ్యాంరావు మాట్లాడుతూ ప్రతి పోలీస్ స్టేషన్‌లో నమోదు చేసే ఎఫ్ఐఆర్‌లో వివరాలు సమగ్రంగా ఉండాలని అన్నారు. మరో అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ డాక్టర్ పల్నాటి సమ్మయ్య వైట్‌కాలర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు, వాటిలో కేసుల నమోదు విషయంలో పోలీసులు చేపట్టాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. సమావేశంలో ఎస్సైలు పీటర్, నాగనాథ్, సందీప్, కృష్ణ కుమార్, నీరేశ్, ఎక్సైజ్‌శాఖ సీఐ బాలయ్య, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ శ్రేణులకు కృతజ్ఞతలు

బోధన్ రూరల్, డిసెంబర్ 2: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో బోధన్ ఎమ్మెల్యే అభ్యర్థి షకీల్ గెలుపుకోసం నెల రోజులు అహర్నిశలు కష్టపడిన బీఆర్ఎస్ శ్రేణులు, ప్రజాప్రతినిధులకు పార్టీ మండల అధ్యక్షుడు ధర్మయ్యగారి సంజీవ్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రశాంత వాతవరణంలో ఎన్నికలు జరిగేందుకు కృషి చేసిన కార్యకర్తలను అభినందించారు.

## మహిళల్లో ఓటు చైతన్యం

మోర్తాడ్, డిసెంబర్2: అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా గురువారం నిర్వహించిన పోలింగ్‌లో మండలంలో మహిళలు అత్యధికంగా ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండలంలోని పది గ్రామాలకుగాను మొత్తం ఓటర్ల సంఖ్య 26,447 కాగా, ఇందులో 21,446 మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఇందులో 9,043 మంది పురుషులు, 12,403 మహిళలు ఓటు వేశారు. మహిళలు అత్యధికంగా ఓటుహక్కును వినియోగించుకోవడం బీఆర్ఎస్‌కు కలిసివస్తుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

## గెలుపుపై బీఆర్ఎస్ ధీమా

ఎడపల్లి, డిసెంబర్ 2: మూడు రోజులు క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు నేడు (ఆదివారం) విడుదల కానున్న నేపథ్యంలో ఎడపల్లి మండలంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు గెలుపు తమపార్టీదేనని ధీమా వ్యక్తం చేస్తున్నారు. బీఆర్ఎస్ హయాంలో చేపట్టిన అభివృద్ధి పనులే పార్టీ అభ్యర్థులను గెలిపిస్తాయని పేర్కొంటున్నారు.

## కిడ్నీ బాధితురాలికి ఆర్థిక సాయం

శక్కర్‌నగర్, డిసెంబర్ 2: బోధన్ పట్టణంలోని రెంజల్ బేస్‌కు చెందిన ఓ తొమ్మిదేండ్ల బాలిక కిడ్నీలు పాడవడంతో డయాలసిస్ కొనసాగుతోంది. ఆ బాలికకు బోధన్‌కు చెందిన ఖిద్మతే ఖల్జ్ అనే స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. రాబోయే రోజుల్లో కూడా సదరు బాలికకు వైద్యానికి తమవంతు సహకారం అందజేస్తామని ఆ సంస్థ ప్రతినిధులు వెల్లడించారు. రెండేండ్లుగా తమ స్వచ్ఛంద సంస్థ ద్వారా మౌలానా ఇలియాజ్ ఖాస్మీ ఆధ్వర్యంలో పలు స్వచ్ఛంద సేవలు అందిస్తున్నామని వారు వెల్లడించారు. ముఖ్యంగా నిరుపేదల వైద్యానికి తమ సంస్థ ద్వారా సాయం అందిస్తున్నామని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు అర్షద్, తమీమ్ తదితరులు పాల్గొన్నారు.

## ఇరిగేషన్ స్థలాన్ని ఆక్రమిస్తే చర్యలు తప్పవు..

నవీపేట, డిసెంబర్ 2: మండల కేంద్రంలో నిజాంసాగర్ డి 50 ప్రధాన కాల్వ ఇరిగేషన్ స్థలాన్ని కబ్జా చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఇరిగేషన్ ఏఈ శ్రీధర్ శనివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. మండల కేంద్రంలోని బాసర రోడ్డు టర్నింగ్ వద్ద ఇరిగేషన్ కాల్వ స్థలాన్ని కొంత మంది వ్యక్తులు ఆక్రమిస్తున్నట్లు తమకు ఫిర్యాదు అందిందని పేర్కొన్నారు. తాము ఎన్నికల విధుల్లో ఉన్నందున ఈ స్థలాన్ని పరిశీలించలేక పోయామని, మరో రెండు రోజుల్లో స్థలాన్ని పరిశీలించి కబ్జాదారులపై శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# కొనసాగుతున్న కబడ్డీ శిక్షణ శిబిరం

మెండోరా, డిసెంబర్ 2: మండలంలోని బుస్సాపూర్ గ్రామంలో 70వ సీనియర్ బాలికల ఇంటర్ డిస్ట్రిక్ కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీల్లో భాగంగా కబడ్డీ శిక్షణ శిబిరం కొనసాగుతోంది. ఈ సందర్భంగా ఆర్గనైజింగ్ సెక్రటరీ కబడ్డీ గంగాధర్ వారికి శిక్షణ ఇస్తున్నారు. ఏలేటి సాయిరెడ్డి జ్ఞాపకార్థం నిర్వహిస్తున్న మెమోరియల్ టోర్నమెంట్ ఈనెల4 నుంచి కొనసాగుతుందని పేర్కొన్నారు.



శిక్షణ శిబిరంలో సాధన చేయిస్తున్న కబడ్డీ గంగాధర్

# పెద్దమ్మ ఆలయంలో యజ్ఞం

రెంజల్, డిసెంబర్ 2: మండల కేంద్రంలోని పెద్దమ్మ తల్లి ఆలయంలో శనివారం యజ్ఞం నిర్వహించారు. ఆలయ రెండో వార్షికోత్సవం సందర్భంగా ఆలయ ఆవరణలో పురోహితులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. భక్తులు తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.



ఆలయంలో యజ్ఞం నిర్వహిస్తున్న భక్తులు

# కొనసాగుతున్న ఆరోగ్య సర్వే

బాల్కొండ, డిసెంబర్ 2 : మండల కేంద్రంలోని వివిధ కాలనీల్లో శనివారం వైద్యురాలు స్రవంతి ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది ఆరోగ్య సర్వే నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి బీపీ, షుగర్, రక్తహీనత లాంటి జబ్బులు ఉన్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. వివరాలను ఆరోగ్య కార్యకర్తలు నమోదు చేసుకున్నారు. అవసరమున్న వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది మాధురి, గ్రేస్, కృష్ణవేణి పాల్గొన్నారు.



బాల్కొండ ఎన్టీఆర్ కాలనీలో ప్రజల నుంచి వివరాలు తెలుసుకుంటున్న ఆరోగ్య సిబ్బంది

## పాఠశాలకు క్రమం తప్పకుండా రావాలి



ప్రభుత్వ పాఠశాలకు వస్తున్న జడ్జి నసీం సుల్తానా

ఆర్మూర్‌టౌన్, డిసెంబర్2: విద్యార్థులు ప్రతిరోజూ పాఠశాలకు క్రమంతప్పకుండా రావాలని ఆర్మూర్ సబ్ డివిజన్ కోర్టు జడ్జి నసీం సుల్తానా సూచించారు. పట్టణంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలను శనివారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగారు. విద్యార్థులు ప్రతిరోజూ పాఠశాలకు రావాలని సూచించారు. విద్యార్థులు శ్రద్ధతో చదువుకొని పాఠశాల పేరుతోపాటు తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని అన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యేలా పాఠాలు బోధించాలని సూచించారు. మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనాన్ని వడ్డించాలని అన్నారు. ఆమెవెంట ఎంఈవో రాజగంగారాం, ఉపాధ్యాయులు ఉన్నారు.

## స్మృతి మందిర నిర్మాణ పనులకు భూమిపూజ

రెంజల్, డిసెంబర్ 2: యావత్ భారతదేశంలోనే హిందూ సమాజ సంఘటిత నిర్మాణం కోసం సర్వస్వాన్ని త్యాగం చేసిన మహనీయుడు డాక్టర్ కేశవ్ బలిరాం పంత్ హెడ్గేవార్ అని భువనేశ్వరి పీఠాధిపతి కమలానంద భారతి స్వామి పేర్కొన్నారు. మండలంలోని కందకుర్తి గ్రామంలో శనివారం కేశవ స్మృతి మందిర నిర్మాణ పనులకు పీఠాధిపతి కమలానందస్వామి, పిట్ల కృష్ణ మహరాజ్, కేశవ సేవా సమితి అధ్యక్షుడు చామకూర సుధాకర్‌రెడ్డి దంపతులు భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఈసందర్భంగా కమలానంద భారతి స్వామి మాట్లాడుతూ.. హెడ్గేవార్ తన పూర్తి సమయాన్ని ధర్మం కోసం, హిందువుల సంఘటితం కోసం కేటాయించారని గుర్తు చేశారు. అంతకు ముందు కేశవ స్మృతి మందిరం పునః నిర్మాణ పనులకు కమలానందభారతి స్వామి, పిట్లకృష్ణ మహరాజు, కేశవ సేవసమితి అధ్యక్షుడు చామకూర సుధాకర్‌రెడ్డి– ప్రభావతి, దేవిదాస్ దంపతులతో బోధన్ పట్టణానికి చెందిన అర్చకుడు ప్రవీణ్ మహరాజు భూమిపూజ నిర్వహించారు.

## రైలు ఢీ.. 10 మేకల మృతి

శక్కర్‌నగర్, డిసెంబర్ 2: బోధన్ పట్టణ శివారులోని బోధన్ నుంచి ఊట్‌పల్లికి వెళ్లే రహదారిలో రైల్వేట్రాక్‌పై శుక్రవారం రైలు ఢీకొని సుమారు 10 మేకలు మృతి చెందాయి. అదే ప్రాంతానికి చెందిన ఖాదర్ అనే వ్యక్తి మేకలు పెంపుతూ జీవనం సాగిస్తున్నాడు. నిత్యం లాగే శుక్రవారం మేకలను మేపేందుకు వెళ్లాగా, పట్టాలు దాటే క్రమంలో రైలు ఢీకొని 10 మేకలు మృతి చెందాయి. ఈ సంఘటనలో సుమారు రూ.లక్ష నష్టం జరిగిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశాడు.

## ఆర్మూర్‌లో కత్తిపోట్ల కలకలం

ఆర్మూర్‌టౌన్, డిసెంబర్2: పట్టణంలోని నిజామాబాద్ ఎక్స్‌రోడ్ వద్ద ఉనన హెయిర్ సెలూన్ నిర్వహిస్తున్న ఉత్తర్‌ప్రదేశ్ కు చెందిన అఖిల్, అసిఫ్ మధ్య శనివారం వ్యాపార లావాదేవీల విషయంలో గొడవలు జరిగాయి. ఈ నేపథ్యంలో వీరిరువురితోపాటు మరికొందరు హెయిర్ సెలూన్ వ్యాపారం నిర్వహిస్తున్నారు. గొడవలు కావడంతో విడిపోవాలని నిర్ణయించుకున్నారు. హెయిర్ సెలూన్ పెట్టుబడి విషయంలో గొడవలు జరగడంతో మాటామాట పెరిగి కత్తిపోట్ల వరకు దారితీసింది. నలుగురు వ్యక్తులు కలిసి బాధితులపై కత్తులతో దాడి చేసి పొడిచినట్లు స్థానికులు తెలిపారు. గొడవలో గాయపడిన వారిని చికిత్స నిమిత్తం ప్రైవేట్ దవాఖానకు తరలించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు.

## పిల్లల ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి



అంగన్‌వాడీ కేంద్రంలో ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

ఏర్గట్ల, డిసెంబర్ 2: పిల్లల ఆరోగ్యంపై తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని మెడికల్ ఆఫీసర్ కె.రాజ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని తీసుకోవాలని, పిల్లల ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గర్భిణులు, బాలింతలు అంగన్‌వాడీ కేంద్రాల్లో అందుతున్న గుడ్లు, పౌష్టికాహారాన్ని తీసుకోవాలని సూచించారు. ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. అనంతరం వైద్య సిబ్బంది విలేజ్ న్యూట్రీషన్ డే నిర్వహించారు. కార్యక్రమాల్లో వైద్యుడు మారుతీ గౌడ్, హెల్త్ అసిస్టెంట్ పండరి, ఏఎన్ఎం, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.